## క్లుప్తంగా

### ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న స్నేహితులు

కూసుమంచి: మండలంలోని ధర్మాతండాకు చెందిన జర్పుల పరశురాం తన కుమార్తెకు వైద్యం చేయించలేక ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం మృతుడి పదో తరగతి (1997–98బ్యాచ్) స్నేహితులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేల నగదుతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మంచానికే పరిమితమైన ఆయన కుమార్తెను చూచి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తారాచంద్, నాగేశ్వరరావు, తుల సీరామ్, కృష్ణ, రమేష్, లచ్చు, ఉపేందర్, శ్రీను, షకిరా, సుశీల, లలిత పాల్గొన్నారు.

### నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరతండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, సుబ్లేడు గ్రామాల్లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాల శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

### విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాలు..



విద్యార్థినికి ప్రోత్సాహక పత్రాలు అందించి సన్మానిస్తున్న కుల పెద్దలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పెరిక కుల విద్యార్థులకు టెన్త్, ఇంటర్, ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించిన 48 మందికి ఖమ్మం వర్తక సంఘ భవనంలో ప్రోత్సాహక పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఖమ్మం జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ నాగార్జున, లెక్చరర్ రామమోహన్, బెడదం సత్యనారాయణ, రాకేష్, సంఘ గౌరవ అధ్యక్షుడు బందు సూర్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ముత్తినేని రత్నాకర్, జిల్లా కోశాధికారి పత్తిపాక వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు గజ్జల వెంకన్న, గౌరవ అధ్యక్షుడు పాయల నాగేశ్వరరావు, కార్యదర్శి మల్లెల అప్పారావు, కోశాధికారి ఆర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు ఖరాబ్..

- వర్షాలకు చిత్తడిగా మారుతున్న రహదారులు
- మరమ్మతులు చేయక ప్రయాణికుల అవస్థలు
- నత్తనడక సాగుతున్న పలు బీటీ రోడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న పలువురు



బ్రిడ్జి నుంచి మామిళ్లగూడెం వెళ్లే దారిలో..

నగరంలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఇప్పటికే గుంతలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతుండగా.. తాజాగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్లపై నీటి మడుగులు ఏర్పడి వాహనాలు కూరుకుపోయే పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో గత వానాకాలంలో పాడైన రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు మరింత దారుణంగా తయారయ్యాయి. పలు రహదారులు బీటీ రోడ్లుగా మారుతున్న నెలల పాటు పెండింగ్‌లో ఉన్నాయి. పాడైన రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంలా ఉంది. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మయూరిసెంటర్ బ్రిడ్జి- మామిళ్లగూడెం మార్గంలో ఏర్పడిన గుంతలు



## అంతర్గతం.. అధ్వానం

- గుంతలతో సరిత క్లినిక్ రోడ్డు
- అధ్వానంగా మయూరిసెంటర్ బ్రిడ్జి – మామిళ్లగూడెం రోడ్డు



జెండాల్‌సెంటర్- సరిత క్లినిక్ వెళ్లే మార్గంలో..

ఖమ్మంరాపర్తినగర్: నగరంలోని మామిళ్లగూడెం వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎప్పుడో దశాబ్ద కాలం క్రితం నిర్మించిన సీసీ రోడ్లు పగిలిపోవడంతో గుంతలు ఏర్పడి నీళ్లు నిలుస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ రోడ్ నుంచి మామిళ్లగూడెంకు వెళ్లే రెండు మార్గాలు గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రోడ్డు పక్కనే ప్రైవేట్ ఆస్పత్రి, పలు రకాల షాపులు ఉన్నా గుంతలను పూడ్చాలని ఆలోచన రాకపోవడం దారుణమనే చెప్పాలి. అదేవిధంగా జెండాల్‌సెంటర్ నుంచి సరిత క్లినిక్ వెళ్లే రోడ్డు మార్గంలో నల్లాల కోసం తవ్విన గుంతలను మున్సిపల్ సిబ్బంది పూడ్చకపోవడంతో అవి మరింత పెద్దగా మారి ప్రమాదాలబారిన పడుతున్నారు.

**మొక్కుబడిగా శంకుస్థానలు..**

నగరంలో రోడ్లు వేసేందుకు ఏర్పాటు చేసిన శంకుస్థాపనల బోర్డులు మొక్కుబడిగానే ఏర్పాటు చేసినట్లు ఉంది. కాని ఆచరణలో పెట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల మెప్పు కోసం కాని కార్యాచరణలో పెట్టడంలో విఫలం చెందారనే ఆరోపణలు ఉన్నాయి. మామిళ్లగూడెంలో 2023లో శంకుస్థాపన చేసిన రోడ్డుకు రెండేళ్ల తర్వాత మోక్షం కలిగిందంటే అధికారుల్లో ఎంతంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. నిధులు విడుదల కాకపోయినా ముందస్తు శంకుస్థాపనలు చేయడం ఏంటని ఆ ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు. మొక్కుబడిగా కాకుండా నిధులు విడుదలయ్యాకే శంకుస్థాపన చేయాలని కోరుతున్నారు.

కంకర తేలి గుంతలు పడిన పంపింగ్‌వెల్ రోడ్డు



## పాడైన పంపింగ్‌వెల్ రోడ్డు..

- ఏళ్లుగా గుంతలు, గతుకులతో దర్శనం
- కంకర తీలినా తప్పని ప్రయాణం

ఖమ్మంక్రైం: నగరంలోని త్రీటౌన్ పరిధి పంపింగ్‌వెల్ రోడ్డులో ఉన్న 30, 35వ వార్డులకు మోక్షం కలగడం లేదు. ఏళ్ల తరబడిగా గుంటలు, గతుకుల రోడ్లపైనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆటోస్టాండ్ నుంచి ఫిల్టర్ బెడ్ వరకు వేసిన సీసీ రోడ్డు పాడవడంతో గుంతలు పడి కంకర తేలి ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు పాడై ఏళ్లు గడుస్తున్నా ఇప్పుడు, అప్పుడు వేస్తాం అంటూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారే తప్ప పట్టించుకునే పరిస్థితి లేదని చెబుతున్నారు.

**రెండు వార్డులకు ప్రధాన రహదారి..**



బాగున్న చిన్న రోడ్డుపైనే ప్రయాణిస్తున్న దృశ్యం

పంపింగ్‌వెల్ రోడ్డు 30, 34వ వార్డులకు ప్రధాన రహదారి అయినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ రహదారిపైనే స్థానికులతో పాటు అవసరాల నిమిత్తం వచ్చివెళ్లే వారు వెళ్తుంటారు. రోడ్డు బాగా లేకపోవడంతో స్కూల్ బస్‌లు జయశంకర్ పార్క్ వద్దే పిల్లలను ఎక్కించుకోవాల్సి వస్తుందంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా పాలకులు స్పందించి రహదారి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ దృష్టికి ఇళ్ల స్థలాల సమస్య



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఖమ్మం నగర మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించకుండా చేసే బాధ్యత జర్నలిస్టులకుందని, వాస్తవాలను ప్రజలకందించి వృత్తిని విలువను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకంలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. నగర మహాసభ అధ్యక్షుడు మైసా పాపారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, ఐజేయూ రాష్ట్ర నాయకుడు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, నర్వనేని వెంకట్రావ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి కనకం సైదులు, నాయకులు నలజాల వెంకట్రావ్, ఆలస్యం అప్పారావు, కమతం శ్రీనివాస్, కొమ్మినేని ప్రసాదరావు, భూపాల్, మహేందర్, మెహియుద్దీన్ పాల్గొన్నారు.

ఖమ్మం నగర కమిటీ ఎన్నిక..



ఐజేయూ నగర కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి శ్రీనివాసరావు, జనార్ధనాచారి, వేణుగోపాల్

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఖమ్మం నగర కమిటీని మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకుపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జనర్ధనాచారి, కోశాధికారిగా ఏలూరు వేణుగోపాల్ ఎన్నికయ్యారు. అదే విధంగా ఖమ్మం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా నగర కమిటీని మహాసభలో ఎన్నుకున్నారు.

**త్వరలోనే పెన్షనర్లకు బకాయిలు..**

2024 నుంచి ఉద్యోగవిరమణ చేసిన పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన బకాయిలను త్వరలోనే చెల్లిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో మంత్రికి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ఆధ్వర్యాన వినతిపత్రం అందించగా ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘం ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, వీరభద్రరావు, మేరి ఏసుపాదం, రహిముద్దీన్, నారాయణ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



బండి జయకిశోర్

ఖమ్మంమయూరిసెంటర్: క్రెడాయ్ ఖమ్మం చాప్టర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండి జయకిషోర్, చెరుకుమల్లి వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఖమ్మంలోని క్రెడాయ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎలక్ట్ ప్రెసిడెంట్‌గా పెద్ది కేశవరావు, కోశాధికారిగా వీములపల్లి నగేష్, ఉపాధ్యక్షులుగా వడ్లమూడి గోపాల్ రావు, సంబూరి ప్రసాద్, కమతం కమల్, ఐనాల నరసింహారావు, సరిపుడి సతీష్, సహాయ కార్యదర్శులుగా ముక్క వీరయ్య చౌదరి, తుళ్లూరి నాగేశ్వరరావు, మల్లెల శ్రీనివాసరావు, వేమిరెడ్డి మహేందర్‌రెడ్డి, మద్దలి శిరీష్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

**➡ కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం**

నేలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మండల కాంగ్రెస్ నాయకుడు మారగాని అంజయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చేపట్టనున్న సంబరాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ అందించాలని కోరారు.

## సంబరంగా బోనాల జాతర..

నగరంలో ఆషాఢ బోనాల జాతర ఆదివారం సంబరంగా జరిగింది. శివసత్తుల నృత్యాలు, మహిళల కోలాటాలు, చిన్నాపెద్ద నృత్యాల నడుమ మహిళలు, యువతులు బోనాలతో ప్రదర్శనగా వెళ్లి దుర్గమ్మ, గంగమ్మ అమ్మవార్లకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకుని ఒడిబియ్యం సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో జాతరను తలపించింది. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: త్రీటౌన్‌లో బోనాలతో విన్యాసాలు చేస్తున్న మహిళలు



శివదుర్గ దేవాలయంలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



వెంకటేశ్వరనగర్‌లో బోనాలతో మహిళలు



ఖమ్మంగాంధీచౌక్: గంగమ్మ జాతరలో బోనంతో పాల్గొన్న యాదవ సంఘ ప్రతినిధులు, తదితరులు



పంపింగ్‌వెల్ రోడ్డులో..





శివసత్తుల నృత్యాలు

**➡ నేటి నుంచి చండీయాగం**

ఖమ్మంగాంధీచౌక్:రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ధూప దీప నివేదన(డీడీఎన్) అర్చక రాష్ట్ర సంఘం ఆధ్వర్యాన సోమవారం నుంచి బుధవారం వరకు హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపాన తుల్జాభవన్ ధర్మశాలలో పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరిగంటి భార్గవా చార్యులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంపై ఆదివారం ఖమ్మంలో జరిగిన డీడీఎన్ ప్రతినిధుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంఘం జిల్లా కన్వీనర్ అన్నవజ్జల ప్రసాద్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆమంచి సురేష్ శర్మ, ఇంగువతసంగమేశ్వర ప్రసాద్ శర్మ, శ్రీధర్ శర్మ, నందుల ఉదయ శర్మ, సుందర్ కుమార చార్యులు, అచ్చుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

**➡ విద్యుత్ సరఫరాకు అంతరాయం..**

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ గాంధీచౌక్ సబ్‌స్టేషన్ 11 కేవీ శివాలయం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల తొలగింపు కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏఈ క్రాంతి సింహ ఆదివారం తెలిపారు. దీంతో ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, సాయిరాం థియేటర్ ప్రాంతం, వీరాంజనేయ స్వామి ఆలయం, కాల్వొడ్డు, మోతీనగర్, రంగనాయకుల గుట్ట, గాంధీనగర్, ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

**➡ మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: తిరుమలాయపాలెం మండలంలోని చంద్రుతండా గ్రామానికి చెందిన బానోత్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఆ గ్రామంలోని మృతుడి కుటుంబాన్ని ఓదార్చి సంతాపాన్ని ప్రకటించారు. నాయకులు బోడ మంచానాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం, గువ్వలగూడెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, షేక్ హుస్సేన్, శాఖమూరి సతీష్, నంబూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**➡ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి**

రఘునాథపాలెం: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన రఘునాథపాలెం మండల కిసాన్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలో ఆయన మాట్లాడారు. మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ రేమల్ల రమేష్, ఉపాధ్యక్షులుగా భాక్యా శ్యామల, కేలోతు రామారావు, బానోతు వెంకన్నలు ఎన్నిక కాగా మండల కార్యదర్శులుగా పరిశెట్టి నరేష్, మొగిలిశెట్టి నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా తగరం రవీంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శేఖర్‌గౌడ్ మాట్లాడగా.. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, మండల అడహక్ కమిటీ కన్వీనర్ వాంకుడోతు దీపక్‌నాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంటెముక్కల నాగేశ్వరరావు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాత రఘురాంలతో పాటు కేలోతు దేవ్‌సింగ్, మాలోతు రాము, చేవగాని రామారావు, కాసిన్ని శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

**➡ యోగాను పాఠ్యాంశంలో చేర్చాలి**



మాట్లాడుతూన్న మరికంటి వెంకటేశ్వర్లు

ఖమ్మం స్పోర్ట్స్: కేజీటూ పీజీ వరకు యోగాను పాఠ్యాంశంగా చేర్చి బోధించాలని తెలంగాణ యోగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరికంటి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కవిత మెమోరియాల్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ తెలంగాణ యోగా సంఘం మహాసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యనిచ్చే యోగాకు ఎంతో ప్రాధాన్యత ఉందని, యోగాకు ప్రత్యేకంగా యోగా మంత్రిత్వ శాఖ, కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దాని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులకు యోగా శిక్ష అవార్డులను అందజేశాక కేజీ టూ పీజీ పాఠ్యాంశానికి సంబంధించిన సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోమాకుల సీతారాములు, పంజాల ఐలయ్య, వంజాకుల లక్ష్మీనారాయణ, యోగా మాస్టర్లు వరలక్ష్మి, కల్పన, రమేష్, అవ్యక్ ఆర్యా, పీక్లే, హారిక, లక్ష్మణ్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**➡ దిష్టిబొమ్మ దహనం..**



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న మరణకాండకు బీజేపీ–బీజేవైఎం మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యాన బీజేపీ–బీజేవైఎం దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించిందని, బీజేపీ–బీజేవైఎం ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ నాయకత్వంపై దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు వంశీ, మనోజ్, జిల్లా నాయకులు లక్ష్మణ్, గోపి, నరేష్, రాకేష్, నరేందర్, పవన్, సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**➡ ప్రపంచంలో బలపడుతున్న కమ్యూనిస్టులు**

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టులు బలపడుతున్నారని, అమెరికా వంటి అహంకార దేశానికి సవాల్ విసేరేది కేవలం సోషలిస్టు దేశాలు, కమ్యూనిస్టు దేశాలు మాత్రమేనని ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, జిల్లా సీనియర్ నాయకుడు నర్రా రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం సుందరయ్యభవన్‌లో జరిగిన మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడారు. ప్రపంచ దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని చలాయించేందుకు ప్రయత్నిస్తుండగా.. మోదీ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా మతతత్వాన్ని ప్రజల్లో రెచ్చగొట్టి గొడవలు సృష్టించి లాభం పొందాలని చూస్తుందని వారు అన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, వన్‌టౌన్ కార్యదర్శి ఒ.నాగులుమీరా, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**➡ నిర్మాణమే కమ్యూనిస్టు పార్టీల బలం..**

ఖమ్మంఅర్బన్: కమ్యూనిస్టు పార్టీలకు బలమే పార్టీ నిర్మాణమని, శక్తివంతమైన నిర్మాణమే శక్తులకు సమర్థ ప్రతిస్పందన అని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. గత రెండు రోజులుగా స్థానిక సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లో రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమవగా.. ఆదివారం సీపీఎం హవేలి పార్టీ కార్యాలయంలో జరిగిన తరగతుల్లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు పాల్గొని పార్టీ రాజకీయ తీర్మానం, నిర్మాణంపై బోధిస్తూ సభ్యుల స్థాయి నుంచి అఖిల భారత స్థాయివరకు పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బండా రమేష్ 'మతం–మతోన్మాదం'అంశంపై క్లాస్ బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, పిన్నింటి రమ్య, నాయకులు కత్తుల అమరావతి, పోతురాజు వెంకటి, గాలి వెంకటాద్రి, గుగులోత్ కుమార్, ఎస్‌కె.హిమాం, కన్నెగంటి తిరుపయ్య, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, మంగమ్మ, గాలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

**➡ గురుకులాల పని వేళలు మార్చాలి**



మాట్లాడుతున్న పారుపల్లి నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: గురుకుల పాఠశాలలు పని వేళలు మార్పు చేయాలని, కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పని వేళలు ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమయ్యేలా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్డెన్, కేర్ టేకర్ పోస్టులను మంజూరు చేసి ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలని, గురుకుల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రతి నెలా మొదటి తారీకునే వేతనాలు చెల్లించాల ట డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రంజాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు బుర్రి వెంకన్న, షమీ, రాంబాబు, రాందాస్, నర్సయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**➡ పిండిప్రోలులో భగవద్గీత గ్రంథ ప్రచారం**

తిరుమలాయపాలెం: త్రైత సిద్ధాంత ఆదికర్త -శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను ఆదివారం మండలంలోని పిండిప్రోలులో ప్రచారం చేశారు. సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజల్లో దైవభక్తి పెంపొందించబడుతుందని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- ఖమ్మం కమిటీ అధ్యక్షుడు సత్యం, సభ్యులు విజయ, మమత, సుజాత, ఉమేష్, ఆరోన్, ఉమేష్, దివ్య, సుజాత, సులోచన, శివ, ఉష, రోహిత, సాయి శంకర్ పాల్గొన్నారు.

**➡ పోస్టర్లు ఆవిష్కరణ**

రఘునాథపాలెం: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకుడు, అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ నేత, అమరుడు రాయల చంద్రశేఖర్‌రావు ప్రథమ వర్ధంతిని ఈ నెల 16న ఇల్లెందులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఆదివారం మండలంలోని వేపకుంట్ల గ్రామంలో ఈ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వర్ధంతి సభకు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, మేక రామనాథం, కూరాకుల నరసయ్య, గుణగంటి బాబు, నరసింహారావు, లైలా రాంబాబు, సుజాత, ఎల్లమ్మ, నాగమణి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


**➡ క్రికెట్ కిట్లు అందజేత**



క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్రికెట్ కిట్లను ఆదివారం కాంగ్రెస్ గిరిజన విభాగం జిల్లా నాయకుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను వెలికితీసేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి గ్రామాల్లో క్రీడల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నందున క్రీడాకారులుగా మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా సీత్యానాయక్, గోబ్రియా, కోటేశ్వరరావు, భూక్యా చీనా తదితరులు పాల్గొన్నారు.


## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గాయత్రి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు( 2006–09బ్యాచ్) ఆదివారం నగరంలోని కావేరి హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ఏళ్ల నాటి మధుర స్మృతులను తెలియజేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు సురేష్, అనుష, శ్రావంతి, భరత్, విజయ్, అనుదీప్‌రెడ్డి, పృథ్వి, యుగంధర్, ఉపేందరయ్య, వెంకటప్పయ్య, బ్రహ్మం, కళ్యాణి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సెంచరీ స్కూల్ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సెంచరీ స్కూల్ పదో తరగతి(2003వ బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్, నాటి ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది టీవీ అప్పారావు, వెంకటేశ్వరరావు, రమణ, లతీఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.